విద్యుదాఘాతంతో 40 గొర్రెలు మృతి 6
టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా దుద్దిళ్ల శ్రీనుబాబు 8

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి స్వప్న రాణి

పెద్దపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.స్వప్న రాణి అన్నారు. మూలసాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొన్నేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న కేసుల వివరాలు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఏవైన సంఘటనలు జరిగినప్పుడు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏవైన కేసులు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. లీగల్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, భాను, న్యాయవాదులు హనుమాన్ సింగ్, ఝాన్సీ శరత్ పాల్గొన్నారు.

బీమాతో కుటుంబాలకు భరోసా


కార్మికురాలికి బీమా పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

జ్యోతినగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కార్మికుడు బీమా సౌకర్యం కలిగి ఉండాలని అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జె.అరుణశ్రీ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియంలో నిర్వహించిన బీమా మేళాలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఏదైన ప్రమాదం జరిగి దురదృష్టవశాత్తు మరణం సంభవిస్తే కార్మికుడి కుటుంబానికి పరిహారం వస్తుందన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, రీజినల్ మేనేజర్ రవిందర్‌సింగ్, రామకృష్ణ, ఎస్‌బీఐ మేనేజర్ నవీన్‌కుమార్, మున్సిపల్ కార్యాలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శంకరస్వామి, సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమారస్వామి, కిరణ్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

14,15 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా షటిల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 ఓపెన్ మెన్, ఉమెన్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 35 నుంచి ,75పై వయస్సు విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ అంశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీలను రెండురోజులపాటు గోదావరిఖని ఆర్‌సిఓఏ క్లబ్, సీఈఆర్ క్లబ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 13వ తేదీ సాయంత్రం 5గంటల లోపు 9396540067, 8328509690, 9110565124 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని అన్నారు.

తొలిమెట్టు ద్వారానే దిశ దశ నిర్దేశించాలి


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అకడమిక్ అధికారి షేక్

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం అమలు సందర్భంగా ఈ ఏడాది అకాడమిక్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఫౌండేషన్ లిట్రసీ న్యూమరసీ (ఎఫ్ఎల్‌సీ)ని బలోపేతం చేయాలని విద్యాశాఖ జిల్లా అకాడమిక్ అధికారి డాక్టర్ పీఎం షేక్ పిలుపునిచ్చారు. గర్రెపల్లి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతు ఎంఈఓలకు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు వర్క్‌షాప్ నిర్వహించారని, అందులో పేర్కొన్న అంశాలను ప్రతీ మండలంలో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అమలు చేయాలన్నారు. ప్రతీ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలు నూతన విద్యా సంవత్సరంలో చేపట్టవలసిన యాక్షన్ ప్లాన్‌కు దశా దిశ నిర్దేశించాలన్నారు. విద్యార్థులు రాయడం చదవడం రావాలని, ఓరల్ రీడింగ్ ఇంప్లూయన్సీ, గణితం, జమ, తీసివేతలు, గుణితాలు, బాగాహారం వంటివి పెంచుతూ ఓ లక్ష్యంను నిర్ణయించుకోవాలన్నారు. గతేడాది ఈ లక్ష్యం 69 శాతం ఉందని ఈసారి 80 శాతానికి చేరుకోవాలన్నారు. ఎంఈఓ రాజయ్య, సీసీహెచ్‌ఎం కవిత, హెచ్‌ఎంలు, ఆర్పీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీ ఎప్పుడు?



- జిల్లాలో 68 టీచర్, 227 ఆయా పోస్టులు ఖాళీ
- రెండేళ్లుగా భర్తీ కానీ పోస్టులు, టీచర్లపై అదనపు భారం
- ఎదురుచూస్తున్న ఆశావహులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మహిళా, శిశు సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిప్రాంతాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 68 టీచర్ పోస్టులు, 227 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న అంగన్వాడీ టీచర్లకే పక్కను న్నటు కేంద్రాలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తున్నారు.

జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని ప్రాజెక్టుల పరిధిలో 706 అంగన్వాడి కేంద్రాలు ఉండగా, వీటిలో 6491 మంది గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు 35,649 మందికి పూర్వ ప్రాథమిక విద్యను, పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. టీచర్లకు నెలకు 13 వేలు, ఆయాలకు 7,800 రూపాయల వేతనం ఇస్తున్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయాల పోస్టులను అంగన్‌వాడీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భర్తీ చేయాలని ఆందోళన కొనసాగిస్తున్నా భర్తీ చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వ ర్యంలో నడిచే అంగన్వాడి కేంద్రాలు చిన్న పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు వారి ఆరో గ్యానికి సంబంధించి ఆహారాన్ని అందిస్తాయి. చివరిసారిగా 2020-21లో ఖాళీ పోస్టులను భర్తీ చేసినప్పటికీ అప్పటినుంచి ఇప్పటివరకు చాలా పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అంగన్‌వాడీల టీచర్లు, ఆయాల వయసు 65 సంవత్సరాలు వచ్చే సరికి పదవీ విరమణ చేయాలని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు చాలా వరకు టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఏర్పడ్డాయి. 2023 నవంబర్ చివరన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయకపోవడంతో వాటిపై ఆశలు పెట్టుకున్న మహిళలు ఆందోళనలకు గురవుతున్నారు.

లబ్ధిదారులకు అందని పౌష్టికాహారం

జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేండ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురి కాకుండా, శారీరకంగా బలహీనం కాకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రోజూ పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతోపాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందతుంది. అలాగే ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను అంగన్‌వాడీ టీచర్లకే అప్పగిస్తుంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా, కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతున్నది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లకు సర్వే బాధ్యతలు అప్పగించడంతో కేంద్రాలు మూతబడుతున్నాయి.



● మారిన నిబంధనలు..

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత నిబంధన ఉండేది. కానీ, కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు నియ మితులయ్యే వారు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలని నిబంధన పెట్టింది. వయో పరిమితి మిగతా 8వ పేజీలో

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం


ధర్మారంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

ధర్మారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టం చేయడం వల్లనే తనలాంటి బలహీనవర్గాల వ్యక్తికి మంత్రి పదవి లభించిందని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం మంగళవారం మండలానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రికి ఘన స్వాగతం పలికాయి. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పత్తిపాక ఎక్స్ రోడ్ వద్ద స్వాగతం పలికారు. కటికెనపల్లి వద్ద మాజీ ఉప సర్పంచ్ రామడుగు గంగారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని గజమాలతో సన్మానించారు. అక్కడి నుంచి ధర్మారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలవేసిన అనంతరం మంత్రి ప్రసంగించారు. ఒక సామన్య కార్యకర్తగా ఉన్న తనను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకొని ఆదరించిందన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో చేయని ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసి చూపించారని తెలిపారు. 10 ఏండ్ల బీఆర్ఎస్ హయాంలో ఎస్సీలకు సమన్యాయం జరగలేదని, ప్రతిపక్షంలో ఉండగా తననున ఎన్నో అవమానాలకు గురి చేస్తూ హేళన చేశారని చెప్పారు. 2018 ఎన్ని కల్లో తాను గెలిచినా అధికారాన్ని అడ్డుపెట్టుకొని సాంకేతికంగా బీఆర్ఎస్ పార్టీ నన్ను ఓడించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, నిరుద్యో గులకు 59 వేల ఉద్యోగాలు కల్పించింది కాంగ్రెస్ పార్టేనన్నారు. ఈ స్థానంలో నిలబెట్టిన ప్రజలందరికి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. దేవి జనార్దన్, కాడె సూర్యానారాయణ, కొత్త నర్సిం హులు, ఈదుల శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలతో మంత్రికి స్వాగతం పలుకగా, పాలకుర్తి రేణుక దేవి లావణ్య ఆధ్వర్యంలో మంగళహారతులతో అడ్లూరికి స్వాగతం పలికారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి


వైద్యఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్

కళ్యాణ్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు సిమ్స్ మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. మంగళవారం మంత్రి నివాసంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల అటెండర్లకు ప్రత్యేక డైనింగ్ హాల్, రెస్ట్ రూమ్‌లు, మార్చురీ రూమ్‌లను విస్తరించాలని, రాజీవ్ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, మెడికల్ సేవల విస్తరణకు చొరవ చూపాలని మంత్రికి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహా ఆయా శాఖల అధికారులతో మాట్లాడి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

13న మంత్రుల పర్యటన

ఎలిగేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రానున్నారు. మండలంలోని పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తారని సమాచారం. ఎమ్మెల్యే విజయరమణారావు, ఏసీపీ కృష్ణతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ప్రభుత్వ మోడల్ స్కూల్ భవనం ఖాళీగా ఉండడంతో అందులో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. భవనానికి కలర్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలీస్‌స్టేషన్ ప్రారంభానికి మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఎస్సై, ఏవో

ముత్తారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలలో వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా మంగళవారం తనిఖీలు నిర్వహించాయి. మండలంలోని పలు విత్తన దుకాణాలలో విత్తన రిజిస్టర్‌లను, బిల్‌బుక్‌లను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని, విత్తనం కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ప్రతీ రైతు విత్తనం కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలని, దానిని పంటకాలం మొత్తం జాగ్రత్తగా ఉంచాలని తెలిపారు. తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి జింక అనూష, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సీట్ల భర్తీ

- ఈ విద్యాసంవత్సరం నుంచే సీబీఎస్ఈ సిలబస్
- సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్


మాట్లాడుతున్న గుండా శ్రీనివాస్

గోదావరిఖని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం నుంచే సింగరేణి విద్యాసంస్థలలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నామని, పారదర్శకంగా సీట్ల భర్తీ జరుగుతుందని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆర్‌జీ-1లోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌కు వచ్చిన ఆయన మాట్లాడారు. సింగరేణి విద్యాసంస్థలలో 9 పాఠశాలలు, ఒక మహిళా జూనియర్ కళాశాల, ఒక మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, ఒక పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 7642 విద్యార్థులతో కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే అకాడమిక్స్, క్రీడలు, అథ్లెటిక్స్ మ్యూజిక్, ఎన్‌సీసీ, స్కౌట్స్అండ్ గైడ్స్ శిక్షణ ఇస్తున్నామని, సీబీఎస్ఈ అడ్మిషన్ల విషయంలో సంస్థ సీఎండీ బలరాం ఆదేశాలను పాటిస్తూ పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని తెలిపారు. సింగరేణి మహిళా డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎంఎల్ అనే కొత్త కోర్సును ప్రవేశపెడుతున్నామని, దీనిద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు వస్తాయని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, బిట్సాట్ పరీక్షలపై అవగాహన, కోచింగ్ ఇస్తున్నామన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, సింగరేణి పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బెస్ అవైలబుల్ స్కూల్‌లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు జిల్లాలోని గిరిజన విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థిని, విద్యార్థులు 5 సీట్లు కేటాయించారన్నారు. 3వ తరగతి లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకల బాలురకు ఒకటి, 5వ తరగతిలో గోండు బాలురకు ఒకటి, 8వ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించారన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్‌లో రెండు లక్షలు, రూరల్‌లో లక్షా 50వేలు ఉండాలని, ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ 2 ఫొటోలతో కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 17న సమర్పించాలని, 20న లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9652118867లో సమర్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆప్రకటనలో తెలిపారు.

పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మాధవి

పెద్దపల్లి కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఈవో మాధవి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాల్సిన పారిశుధ్య చర్యల గురించి నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదులు, టాయిలెట్లు, ఆటస్థలాలు, అసెంబ్లీ ప్రాంతాలు, సిబ్బంది గదులు, నీటి ట్యాంకులు ఎలా శుభ్రపరుచుకోవాలనే అంశంపై ప్రతీ మండలం నుంచి ఒక ఉపాధ్యాయుడికి, ఇద్దరు పారిశుధ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఈనెల 11న మండల కేంద్రాల్లో పారిశుధ్య పనులపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారి సూచించారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత చేతులు కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. మండల విద్యాశాఖ అధికారి టి.సురేందర్, రిసోర్స్‌పర్సన్ దయాకర్, సమన్వయకర్త అజీమ్‌దమీర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్యకరమైన వాతావరణం

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. భూపతిపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం పరిశుభ్రత పారిశుధ్యం అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలోని పలు కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు చెందిన వారితో శిక్షణ సదస్సు నిర్వహించారు. డీఈవో విద్యాలయం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రత వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. స్కూల్స్ ప్రారంభం అయిన తర్వాత విద్యార్థులకు పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత శుభ్రత ఇతర అంశాలపై అవగాహన కల్పించా లన్నారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలతో, పారిశుధ్య సిబ్బందితో జిల్లా జెండర్ ఈక్విటీ కో ఆర్డినేటర్ కవిత సమావేశం నిర్వహించారు. పలువురు స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా, బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి జైత భీమయ్య(66) అనే వ్యక్తి 2019 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై రాయికల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజేష్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రాజు, కిరణ్ శ్రీధర్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు



ప్రమాదానికి గురైన స్కూటీ

పెద్దపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గాయపడిన సంఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. మంగళవారం పెద్దపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని ఓమసియా, భోజన్నపేటకు చెందిన విద్యార్థిని అక్షయలు స్కూటీపై ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

మంథనిరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి జక్కుల రాజకొమురయ్య (49) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జక్కుల రాజకొమురయ్యకు చెందిన పాడి పశువులు చెరువులో ఉన్నాయి. వాటిని ఒడ్డుకు తీసుకురావటానికి ఆయన చెరువులోకి వెళ్లగా చెరువులోని గుంతలో పడి మృతి చెందాడు. చెరువు ఒడ్డున మృతుడికి సంబంధించిన దుస్తులు, చెప్పులు ఉండటంతో గ్రామానికి చెందిన గట్టయ్య అనే వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చెరువులో గాలించగా మృతదేహం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

శంకరపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేశవపట్నం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ రైతుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆరెపల్లి తిరుపతికి చెందిన పాడి ఆవు మంగళవారం ఉదయం మార్కెట్ యార్డు పక్కన ఉన్న వాగు వద్ద మేత కోసం కట్టేశాడు. ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 40వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు తిరుపతి కోరుతున్నాడు.

పొలం పండుగ



- నేడు ఏరువాక పౌర్ణమి
- వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుడమితల్లి పులకరించే పొలం పండుగ ఏరువాక పౌర్ణమి వచ్చేసింది. రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియనుంది. శ్రమజీవన సౌందర్యానికి సూచికైన ఈ పౌర్ణమి విశేషాలు వేదకాలం నుంచి నేటి వరకు ఉన్నాయి. ఏటా వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు అన్నదాతలు పండుగ జరుపుకుంటారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించి పొలం దున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఏరువాక అంటే భూమిని దున్నడం అని అర్థం. జ్యేష్ఠ మాసం శుక్ల పక్ష పూర్ణిమ నాడు ఏరువాకను జరుపుకోవడం ఆనవాయితీ. నైరుతి ఋతుపవనాల రాకతో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని పొలం పనులకు ఆటంకాలు కలుగకూడదని రైతులు ఏరువాకను యజ్ఞంగా భావిస్తారు.

ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం

ఏరువాక పౌర్ణమికి ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉంది. ఏరువాకను జ్యోతిష శాస్త్రవేత్తలు కష్యారంభం, సస్యారంభంగా వ్యవహరిస్తారు. ఔషధులకు పతి అయిన చంద్రుడు నాగలి పనులకు ఉత్తమ నక్షత్రమైన జ్యేష్ఠా నక్షత్రానికి సమీపంలో సంచరించడమే కారణం. ఋతువులలో మార్పును సూచిస్తూ ప్రకృతితో మమేకమైన ఈ పండుగ తొలకరి జల్లులతో ప్రారంభమవుతుంది. నాగలి కదిలేముందు క్షేత్రపాలకుడిని పూజించేవారని ఋగ్వేదంలో ఉంది. బుద్ధుడి తండ్రి శుద్ధోదనుడు ఏరువాక రోజున రైతులకు ఒక బంగారు నాగలిని అందించేవాడని బౌద్ధ రచనలు చెబుతున్నాయి. పాళీ, ప్రాకృత భాషల్లోని కథల్లోనూ ఈ ప్రస్తావన ఉన్నట్లు సమాచారం. జైమినీయ న్యామాలా గ్రంథంలో, హాలుని గాథాసప్తశతిలో ఈ పండుగ ప్రస్తావన కనిపిస్తోంది.

ఇలా ఆచరిస్తారు

ఈ పండుగ పూర్తిగా వ్యవసాయానికి, పనిముట్లకు, పశువులకు సంబంధించిన పండుగ కావడంతో రైతులు వ్యవసాయ సాధనాలను, భూమిని, పశువులను పూజిస్తారు. ఎద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేస్తారు. పశువుల పాకలను, పశువులను కట్టే గాటిని, కాడిని, నాగలిని శుభ్రపరిచి పసుపు, కుంకుమలు, గంధంతో అలంకరిస్తారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి పొంగలిని, భక్ష్యాలను వాటికి ఆహారంగా పెడతారు. మంగళ వాయిద్యాలు, పాటలు, పద్యాలు, కోలాహలం మధ్య సాయంత్రం రైతులు నాగలిని భుజంపై ధరించి ఎద్దులను తోలుకుంటూ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్తారు. అక్కడ భూమిపూజ అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. గోగు నారను తాడులా చేసి తోరణం కట్టి దాన్ని చెర్నాకోలతో కొడుతూ వారికి దొరికిన నారను తీసుకొని ఎద్దుల మెడల్లో, నాగలికి కడతారు. ఉత్తర భారతంలో పలు ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటకలోనూ ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

అన్నపై దాడి కేసులో తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

మెట్‌పల్లిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో అన్నపై దాడి చేసిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి కోర్టు న్యాయ మూర్తి అరుణ్‌కుమార్ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన మల్లయ్యకు ఐదుగురు కుమారులు కాగా ఆత్మకూరు గ్రామ శివారులో ఆయనకు ఒక ఎకరం భూమి ఉంది. ఆ భూమిని ఐదుగురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవలు సృష్టించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల భూమిని వదిలేసి మిగతా భూమిని నలుగురు అన్నదమ్ములు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం వ్యవసాయం చేసుకుంటున్నారు. అన్నదమ్ములు సాగు చేసుకుంటున్న పంటను బీరయ్య 2019లో తన ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా అన్న ముత్తయ్య అడ్డుగా వెళ్లాడు. దీంతో అన్నను పారతో కొట్టగా అతని కుడి భుజంపై గాయమైంది. దాడి ఘటనపై రెండో తమ్ముడు నడిపి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నిందితుడు బీరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అరుణ్ కుమార్ నిందితుడు బీరయ్యకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ట్రైనీ ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సంపత్

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలో దళితుడు బత్తుల మహేందర్‌పై దాడి చేసిన ట్రైనీ ఎస్ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి టి సంపత్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజుల క్రితం మహేందర్‌పై పోలీసులు దాడి చేసిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో ట్రైనీ ఎస్సై భార్గవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. పోలీసులు ప్రజలను రక్షించడానికి ఉన్నారే తప్ప దౌర్జన్యంగా కొట్టడానికి కాదన్నారు. ట్రైనీ ఎస్ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించకపోతే హైకోర్టుకు వెళ్తామన్నారు. సమావేశంలో ఆర్ రామచంద్రం, టి వసంత్, సీహెచ్ రాహుల్, మహేందర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో పట్టుకుని అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా అనుమతి లేదని గుర్తించామని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తంగళ్లపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంట్లో పని చేస్తూ బీపీ ఎక్కువై కింద పడిపోవడంతో తలకు గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిమల రాజవ్వ (51) ఈ నెల 1న ఇంట్లో పనిచేస్తుండగా బీపీ ఎక్కువై కింద పడిపోయింది. దీంతో రాజవ్వకు తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ కావడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త రామచంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్ తిరుపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వర్థినేని రవీందర్‌రావు, శ్రీనివాస్, హరిప్రసాద్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డుతోనే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి


సమావేశంలో మాట్లాడుతున్న చిలువేరు స్వామి

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లేబర్‌కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ, ప్రమాద బీమా పథకాలను వెల్ఫేర్ బోర్డుతోనే వర్తింపచేయాలని భవన నిర్మాణ కార్మిక సమైఖ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. మంగళవారం కల్వచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఈ నెల 4న ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు దరఖాస్తు చేసుకోవడానికి ఆహ్వానించిందన్నారు. ప్రమాద బీమా రూ.8లక్షలు కాగా శాశ్వత వైకాల్యానికి రూ. 5లక్షలు, పాక్షిక వైకల్యం రూ. 4లక్షలు, సాధారణ మరణం రూ. 2లక్షలు ఇవ్వాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారని తెలిపారు. తద్వార సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందె అవకాశం ఉండవని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు పెట్టే నిబంధనలతో కార్మికులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే సంక్షేమ ఫలాలను కార్మికులకు అందించాల్సిందిగా డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరునహరి రాజు, ఎస్కే షరీఫ్, బైరిశంకర్, మల్లేష్, శంకర్, రాజయ్య, చంద్రమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్‌తో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం


పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను సన్మానిస్తున్న రెవా నాయకులు


జ్యోతినగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం(రెవా) ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ మహమ్మద్ ఫసియొద్దిన్‌తో కరీంనగర్‌లోని పీఎఫ్ కార్యాలయంలో సమావేశమయ్యారు. నిజ వేతన ఆధారిత పెన్షన్(హయ్యర్ పెన్షన్)కు సంబంధించి 230 మంది మాజీ ఉద్యోగులు వారి బకాయి డబ్బుల డీడీలను గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పీఎఫ్ కార్యాయంలో సమర్పించారని సంఘం నాయకులు గుర్తు చేశారు. 55 మంది విశ్రాంత ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు ఈనెలలో జారీ చేస్తామని, జూలైలో మరో 100 మంది రిటైర్డ్ ఉద్యోగులకు జారీచేస్తామని కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకు 10 మంది మాజీ ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు జారీ చేసినందుకు పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్, ఎపిఎఫ్‌సి వెంకటేశ్వర్లు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను రెవా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం(రెవా) అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ఉపాధ్యక్షుడు మంగళంపల్లి రాంనారాయణ, సంయుక్త కార్యదర్శి చెప్యాల శ్రీపతిరావు, జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికి దుంగల అపహరణ


తాండ్ర్యాలలో నరికివేసిన టేకు చెట్టు

కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతుల పొలాల్లో ఉన్న టేకు చెట్లను నరికివేసి ఎత్తుకెళ్లారు. తీగల వెంకట్రావు, తీగల సత్యారావు, కాల్వ రాజేశం, కనకట్ల ప్రసాద్ అనే రైతులు తమ పొలాల వద్ద టేకు చెట్లను పెంచుకున్నారు. దుండగులు రాత్రి వేళలో 11 చెట్లను నరికివేసి దుంగలను ఎత్తుకెళ్లినట్టు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాదాపు 4 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మేడిద హరీష్ మే 18న సెల్‌ఫోన్ పోగొట్టుకొని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మంచిర్యాలలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. మంగళవారం బాధితుడు హరీష్‌కు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

విద్యుదాఘాతంతో 40 గొర్రెల మృతి


కటికెనపల్లి శివారులో మృతిచెందిన గొర్రెలు

ధర్మారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన 40 గొర్రెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. చామనపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు కాపరులు కటికెనపల్లి గ్రామ శివారులో గొర్రెలను మేపేందుకు మంగళవారం మధ్యాహ్నం తీసుకెళ్లారు. నల్లవాగు ప్రాంతంలోని సున్నం మాటు వద్ద గొర్రెలు నీరు తాగుతూ వాగు దాటే క్రమంలో విద్యుత్ స్తంభం ఇన్సులేటర్ విరిగి ఇనుప స్తంభం పట్టిపై పడింది. స్తంభం నుంచి చెట్ల కొమ్మల ద్వారా వాగు నీటికి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో నీరు తాగుతున్న గొర్రెలు షాక్‌కు గురయ్యాయి. ఈ సంఘటనలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా 30 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏడి విజయ్‌కుమార్, ఏఈ ఎండీ ఖాసీమ్ సందర్శించారు. చనిపోయిన 40 గొర్రెలకు సంస్థ తరుపున 2 లక్షల 80వేలు రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అస్వస్థతలో ఉన్న జీవాలు ఎప్పుడు చనిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని, వాటితో కలిపి 6 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేశారు.

నష్ట పరిహారం పూర్తిగా చెల్లించాలి

ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుదాఘాతంతో చామనపల్లి గ్రామానికి చెందిన దాడి ఐలయ్య, దాడి ఓదెలు, నిట్టు మల్లయ్య, బైర రాయలింగు, నిట్టు ముజ్జయ్య, కొమ్మ లచ్చయ్యలకు చెందిన 40 గొర్రెలు మృతి చెందగా 30 గొర్రెల వరకు అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితితో ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రాన్స్‌కో అధికారులు మృతి చెందిన 40 గొర్రెలకు ఒక్కోదానికి 7 వేల చొప్పు న మొత్తం 2 లక్షల 80 వేల నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పగా గొర్రెల కాపరులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. తామంతా 6 లక్షల వరకు నష్టపోయామని అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రెలకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని బీజేపీ సీనియర్ నాయకులు కన్న అంజయ్య, జిల్లా గొర్రెల కాపరుల సఘం అధ్యక్షులు వేల్పుల నాగరాజు, గొర్రెల సొసైటీ మండల అధ్యక్షులు జంగ మహేందర్ సందర్శించారు.

భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్(36)కు కావేరితో 2014లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హరీష్ గత కొద్ది సంవత్సరాలుగా గల్ఫ్‌బాట పట్టాడు. కొద్ది నెలల క్రితం హరీష్ స్వగ్రామానికి రాగా భార్య కావేరి హరీష్‌ను సూటి పోటి మాటలతో వేధించడమే కాకుండా ఆత్మహత్య చేసుకోవాలంటూ ఇబ్బంది పెడుతుండేది. దీంతో భార్య వేధింపులు తట్టుకోలేక హరీష్ గ్రామంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన కుమారుడి మృతికి కోడలు కావేరి కారణమని తల్లి ప్రమీల ఎస్ఐకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి గోదాముల వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో లారీకి నిప్పంటుకుంది. అయితే సమీపంలో ఉన్న మిగతా లారీ డ్రైవర్లు, హమాలీలు లారీకి అంటుకున్న మంటలను ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పెద్దపల్లికి చెందిన లారీ కొంత కాలిపోయింది. వివిధ మిల్లుల నుంచి బియ్యం లోడ్‌లతో వచ్చిన లారీలు అన్‌లోడ్ అయ్యాక పక్కన నిలిపి ఉంచారు. అయితే పైన ఉన్న విద్యుత్ తీగలు గాలిదుమారం వలన ఒకటికొకటి తాకుతూ నిప్పురవ్వలు చెలరేగి లారీకి అంటుకున్నాయని ప్రత్యక్షంగా చూసిన వారు తెలిపారు. లారీ డ్రైవర్లు, హమాలీలు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

ఇసుక లారీ డ్రైవర్ల ధర్నా


కొర్కల్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న ఇసుక లారీ డ్రైవర్లు

వీణవంక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు ఇసుక రీచ్ యాజమాన్యం రోజులు గడుస్తున్నా లోడింగ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని లారీ డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. మూడు రోజులు గడుస్తున్నా లారీల్లో ఇసుక లోడింగ్ చేయడం లేదని అన్నారు. ప్రతి రోజు చేయాల్సిన లోడింగ్ చేయకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లా లారీ డ్రైవర్లను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కొర్కల్ ఇసుక రీచ్ నుంచి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ


శిక్షకులకు సర్టిఫికెట్ ప్రదానం అధికారులు

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని నియంత్రించే పద్ధతులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని కల్నల్ ఆఫీసర్ ఏకే జయంతి, స్టేషన్ ఫైర్ ఆఫీజర్ రాజు నాయక్ అన్నారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్ పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరంలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ఆకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఆస్తినష్టం, ప్రాణనష్టం కాకుండా వెంటనే స్పందించాలని అన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ వి కృష్ణ, సబ్ మేనేజర్ సాగర్‌సింగ్, కేడెట్లు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్, వెదురుగట్ట గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సువర్ణ, డాక్టర్ మహేష, ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి వంశీ, విస్తరణ అధికారులు సాయి ప్రసన్న, సంపత్ పాల్గొన్నారు.


ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖల పేరుతో పలు ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర డీడీఎన్ సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకరాచార్యులు అన్నారు. అర్చక ఉద్యోగులతో పాటు ధూపదీప నైవేద్య అర్చకుల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం కోసం 41 రోజులపాటు డీడీఎన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటకు చెందిన మర్రి తిరుపతి గేదెలు రెండు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేత కోసం కొండగట్టు సమీపంలోకి వెళ్లగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తాకి గేదెలు మృతి చెందాయని తిరుపతి తెలిపాడు. మృతి చెందిన గేదెల విలువ రూ.1.50లక్షల వరకు ఉంటుందని అన్నాడు.

ఇందిరమ్మ ఇళ్లకు గుత్తేదారుల వల



- 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు
- 600 చదరపు అడుగులకు రూ.16 లక్షలు
- లబ్ధిదారులతో ఒప్పందాలు ● అప్పు చేస్తున్న పేదలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నీడలేని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పల్లెల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసింది. లబ్ధిదారుల జాబితాను ప్రకటించింది. ఈ నెల 8తో శుభ ముహూర్తాలు ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అదే అదనుగా భావించిన కొందరు గుత్తేదారులు తాము ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులకు వల విసిరారు. 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు చెల్లిస్తే అన్ని పనులు పూర్తి చేయడంతో పాటు రంగులు వేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసి ఇస్తామంటూ ముందుకు వస్తున్నారు. 600 చదరపు అడుగుల భవనానికి రూ.16 లక్షలు చెల్లిస్తే నిర్మిస్తామని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ నిబంధనలతో తమకు సంబంధం లేకుండా అంతా తామే చూసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లు మీరే చూసుకోవాలని తేల్చి చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షలతో పాటు రుణం తీసుకుంటే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా గుత్తేదారులే చూసుకుంటారని భావిస్తున్న లబ్ధిదారులు ఒప్పంద పత్రాలను రాసుకుంటున్నారు. ముందుగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఉన్నంతలో సొంతింటి కల సాకారం చేసుకుందామనుకుంటున్న పేదలకు గుత్తేదారులు అన్ని వసతులతో నిర్మించి ఇస్తామని పేర్కొంటుండడంతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.



ఇందిరమ్మ పథకం.. గుత్తేదారులకు వరం

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల, తదితర గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గుత్తేదారులకు వరంలా మారనుంది.

మండలంలో మొత్తం 643 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు సుమారు 200 ఇళ్లకు భూమి పూజ చేశారు. పల్లెల్లో ఇళ్ల నిర్మాణాల సందడి నెలకొనడంతో గుత్తేదారులు వాలారు. తాము 400, 600 చదరపు అడుగుల ఇంటి భవన నిర్మాణంతో పాటు రంగులు, ఇతర పనులు పూర్తి చేసి తాళం చెవులను అందజేస్తామని పేర్కొంటున్నారు. అందుకు తమకు రూ.10 లక్షలు, రూ.16 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో ఇబ్బందులు లేకుండా ఉంటాయనే ఆలోచనతో గుత్తేదారులతో లబ్ధిదారులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపు ఇలా...

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు భూమి పూజ చేసిన నుంచి పనులు పూర్తయ్యే వరకు గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

- లబ్ధిదారుడు తన స్వంత స్థలంలో 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలి.
- ప్రభుత్వం చెల్లించే రూ.5 లక్షల్లో పునాది నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.
- రెండో విడతలో గోడలు నిర్మించిన తర్వాత రూ.1.25 లక్షలు జమ అవుతాయి.
- స్లాబ్ దశలో ప్రభుత్వం రూ.1.75 లక్షలను జమ చేస్తుంది.
- ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు రూ.లక్ష ఖాతాలో జమ చేయడంతో మొత్తం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి సర్కారు అందించే రూ.5లక్షల ఆర్థిక సాయం అందుతుంది.

నిబంధనల మేరకే బిల్లులు : సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో నిరుపేదను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయడంతో పాటు మంజూరు పత్రాలను అందజేశాం. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగిస్తూ ఒప్పంద పత్రాలు రాసిస్తున్నారనే విషయం తమ దృష్టికి రాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షించిన తర్వాత వివిధ దశలో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతుంది.

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతిలో అర్హులైన విద్యార్థులకు ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ ఎంపికలను మూడంచెల పద్ధతిలో ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో, ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. మూడు క్రీడా పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. 3వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో ఉంచిన క్యూఆర్ కోడ్

ఎస్‌యూ ఆంగ్ల విభాగంలో డిజిటల్ తరగతులు



డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత

గణేశ్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో డిజిటల్ క్లాసు రూమ్‌ల ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ క్లాస్‌రూమ్‌లు విద్యా సంస్థలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనేక ప్రయోజనాలను, బోధనను, అభ్యాసాలను నేర్చుకోవడానికి సహకారం అందిస్తాయన్నారు. ఆంగ్ల విభాగాధిపతి విజయ ప్రకాష్ మాట్లాడుతూ డిజిటల్ క్లాస్ రూమ్‌ని అందించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార జాస్తి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లలితపల్లిలో ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలితపల్లిలో లక్ష్మీపార్వతిదేవి, రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శివపట్నం వేసి బద్దిపోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు మహిళలు బోనం ఎత్తుకొని మంగళహారతులతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి బోనాలను దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు మండల చిన్న గట్టయ్య, నాయకులు మండల శ్రీశైలం, శంకర్, బావు పోశాలు, రవి, మామిడి రాజయ్య, కనకయ్య, రాములు పాల్గొన్నారు.



ఎల్లమ్మ బోనాలతో మహిళలు

- సుల్తానాబాద్ : మండలంలోని చిన్నకలువలలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామస్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయానికి

పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలను, పాడిపంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని సోమవారం దర్శించుకున్న భక్తులు మంగళవారం అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఉదయాన్నే అమ్మవారికి మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు నెత్తిన బోనాలతో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించినట్లు తెలిపారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నం వేసి నూతన వస్త్రాలు అందజేసి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారికి నైవేద్యాన్ని అందజేసి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను, పాడిపంటలను చల్లంగా చూస్తే మళ్లీ వచ్చే యేడుకు తిరిగివచ్చి మొక్కులు చెల్లిస్తామని చెప్పి భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఉద్యోగులు క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ వీధుల్లో రద్దీ కనిపించింది.



శివసత్తుల నృత్యాలతో ఆలయానికి వెళుతున్న భక్తులు



బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

డాక్టర్ భూంరెడ్డి మృతి తీరనిలోటు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



భూంరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ భూంరెడ్డి మరణం తీరని లోటని, వైద్య వృత్తితోపాటు సామాజిక సేవకు కృషి చేశారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూంరెడ్డి ఎంఎస్ చదువుతున్న రోజుల్లో ఢిల్లీలోని ఏయిమ్స్‌లో అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్‌నెహ్రూ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, పట్టా అందుకున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో అనారోగ్య కారణాలతో జవహర్ లాల్‌నెహ్రూ ఆసుపత్రిలో చేరిన సమయంలో భూంరెడ్డిని స్వయంగా పిలిపించుకొని వైద్య సేవలు పొందడం గర్వించదగ్గ విషయమని గుర్తుచేసుకున్నారు. అంతకుముందు భూంరెడ్డి కుమారుడు సూర్య నారాయణరెడ్డిని, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రితోపాటు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.

భూంరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు



భూంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ప్రముఖ వైద్యులు డాక్టర్ భూంరెడ్డి సోమవారం ఆకస్మికంగా మృతి చెందగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి భూంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ భూంరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, గడ్డం విలాస్‌రెడ్డి, ఎస్‌ఏ మోసిన్, రాచకొండ చక్రాధర్, పొన్నంసత్యం ఉన్నారు.

నివాళులుఅర్పించిన చాడ

- భగత్‌నగర్ : ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి పార్థివ దేహం వద్ద సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మంగళవారం కరీంనగర్‌లో నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాప సభ

రాజబహద్దూర్ వెంకటరామరెడ్డి విజ్ఞాన పరిషత్ (రెడ్డి సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.భూమ్‌రెడ్డి సంతాప సభను నిర్వహించారు. అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కాసర్ల మధూకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్‌చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించడంతో పాటు జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను రాష్ట్రం ప్రభుత్వం పెంచడంతో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలంటూ నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికే గతంలో పెంచిన బస్‌చార్జీలు, విద్యార్థుల బస్‌పాస్ చార్జీల కారణంగా గ్రామాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. మళ్లీ బస్‌పాస్‌లపై 20 శాతం చార్జీలు పెంచి అమలుచేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రధానంగా ఉన్నత చదువు కోసం బస్సులను నమ్ముకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని చదువుకు దూరమైయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులను నడపడం లేదన్నారు. బస్సుల సంఖ్య పెంచి ఉచిత బస్‌సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పాసుల చార్జీల పెంచాలనే ఆలోచనలను విరమించుకోవాలని లేకుంటే ఆందోళన చేపడుతామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాలలు ఉన్నాయని, వాటిని విద్యాశాఖ అధికారులు వెంటనే సీజ్‌చేయాలని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టల్‌లకు పక్కా భవనాలను నిర్మించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా బాలికల కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయిభరత్, శివ, నాయకులు జస్వంత్, అఖిల్, అక్షయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పకుర్తి, రామచంద్రపురం గ్రామంలో జరుగుతున్న గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్నాలలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్



సిరిసిల్లలో టీఆర్‌టీఎఫ్ బడిబాట బైక్‌ర్యాలీ

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (అంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలందరినీ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లలో మంగళవారం తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బోయన్న గారి నారాయణల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని పట్టణంలోని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్య ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీన ర్ సుంకిశీల ప్రభాకర్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోతీలాల్, టీఆర్‌టీఎఫ్ నాయకులు పోతుగంటి రమేష్, మహేశుని లక్ష్మీనారాయణ, గోలీ రాధాకిషన్, ముత్తయ్యగారి నాగరాజు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు



అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మంగళవారం వేకువ జాము నుంచే వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల జిల్లా జడ్జి రత్నపద్మావతి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

- భక్తులకు ఇబ్బందులు

కొండగట్టు కొండపై వాహనదారులు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ఆంజనేయస్వామి దర్శనానికి ఇరవై వేలకు పైగా భక్తులు వందలాది వాహనాల్లో తరలివస్తుంటారు. అయితే సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో కొండపైన, ఘైజంక్షన్, జేఎన్‌టీయూ మార్గం, ఘాట్‌రోడ్డు మొత్తం వాహనాలతో నిండుతున్నాయి. స్వామి వారి దర్శనానికి ఒక్క రోజు ముందే వాహనాలు పార్కింగ్ చేసి పెట్టడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా అధికారులు ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి కొండపైన వాహనాలను నియంత్రించి అసౌకర్యం కలుగకుండా చూడాలని పలువురు భక్తులు కోరుతున్నారు. రద్దీ సమయాల్లో వాహనాలను ఇష్టారీతిలో నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీ ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొంది. ఖాళీల్లో 50 శాతం ఆయాలకు ఉద్యోగోన్నతి కల్పించి భర్తీ చేయాలని నిబంధనల్లో పేర్కొంది. అయినా కూడా అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆశావహులు ఎప్పుడు భర్తీ చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

నోటిఫికేషన్ వచ్చాకే భర్తీ

- వేణు గోపాల్, జిల్లా సంక్షేమ అధికారి

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర కమిషనరేట్ నుంచి నోటిఫికేషన్ రావాల్సి ఉంది. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పోస్టులను భర్తీ చేస్తాం. ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల వివరాలు సేకరించాం. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లే పనిచేస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగించాం.

పూసాల శంభునికుంట మత్తడి ఆక్రమణ



ఫిర్యాదు చేస్తున్న మత్స్యపారిశ్రామిక సొసైటీ అధ్యక్షుడు గుర్రాల మల్లేశం

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామం పూసాలలో విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. పూసాలలో రెవెన్యూ అధికారులు మంగళవారం భూ భారతి సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నేత గుర్రాల మల్లేశం, మాజీ ఎంపీటీసీ పురం ప్రేంచందర్‌రావు, రమణ తదితరులు తహసీల్దార్‌కు దరఖాస్తు చేశారు. శంభునికుంట మత్తడి స్థలంలో ఉన్న హద్దు రాళ్లు తొలగించారని, కొందరు ప్లాట్లుగా అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. హద్దులు నిర్ణయించి భూములను పరిరక్షించాలని కోరారు.

ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

కోల్‌సిటీటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉచిత బస్సు పాస్ ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం కోరారు. మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ భూషణంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారని, ప్రభుత్వం బస్ చార్జీలను పెంచడంతో చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్నదని అన్నారు. కేజీ టూ పీజీ చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొలుగూరి నితీలేష్, కోశాధికారి ఎల్కపల్లి సురేష్, కార్పొరేషన్ అధ్యక్షుడు మాతంగి సాగర్, నాయకులు రౌతు అరవింద్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ గెలలతో రైతులు

ఎలిగేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ అధికారి ఉమాపతి, ఉద్యాన అధికారి మహేష్ అన్నారు. మంగళవారం శివపల్లిలో తిరుమల ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా జనేని శ్యామ్‌సుందర్‌రావు ఆయిల్‌పామ్ క్షేత్రంలో మొదటి పంట కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు గ్రామాల్లో 200ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందని, మరో 80ఎకరాల్లో మొక్కలు నాటడానికి రైతులు సన్నద్ధంగా ఉన్నారని అన్నారు. ఏఈవో గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్, రైతులు చింతిరెడ్డి రాజిరెడ్డి, కొత్తిరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న శాసతివేత్త శ్రీధర్ సిద్ధి

పెద్దపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని కునారం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ సిద్ధి అన్నారు. మంగళవారం రాంపల్లి రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. అన్నదాతలకు అవగాహన, వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు పురుగుల మందులు వాడాలని, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనేటప్పుడు రశీదులు తీసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులతో ఎక్కువ లాభాలు ఉంటాయన్నారు. జిల్లా ఉద్యాన అధికారి మహేష్, మండల వ్యవసాయాధికారి అలివేణి, మాజీ సర్పంచ్ కనపర్తి శ్రీలేఖ-ప్రభాకర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

కళ్యాణ్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లోని నిరుపేద కుటుంబమైన ఓదెలుకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు పి.మల్లికార్జున్ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఓదెలుకు ఆర్థిక సహాయం అందించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచనల మేరకు చేయూతనిచ్చినట్టు చెప్పారు. కామ విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిప్పారపు మధు, నర్సింగ్‌దొర, ముచ్చకుర్తి మహేష్, బోయిని మల్లేష్, విజయ్, రఫీక్, చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక కమిషనర్‌కు సమాచార కమిషన్ నోటీసులు

మంథని, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం కింద సరైన సమాచారం ఇవ్వని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్‌కు సమాచార కమిషన్ నోటీసులు జారీ చేసినట్లు పిటిషనర్ ఇనుముల సత్యనారాయణ మంగళవారం తెలిపారు. మంథని సహాయ కార్మిక శాఖ అధికారినిపై పలు ఆరోపణ చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఫిర్యాదుపై తీసుకున్న చర్యల నివేదిక ప్రతులను ఇవ్వాలని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకోగా సకాలంలో ఇవ్వకపోడంతో అప్పీల్‌కు వెళ్ళినట్లు తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్‌కు సమాచార కమిషన్ నోటీసులు ఇస్తూ ఈనెల 12న హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన



జనగామలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మంగళవారం అల్లూరులో పంటల సాగుపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడారు. రైతులు సమగ్ర పంట ప్రణాళికను తయారు చేసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. కూరగాయలు, పూలు సాగు చేయాలని వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డా. వినోద్‌కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్త డా. నవ్య, డైరెక్టర్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తలు డా. కన్నకి, డా. లక్ష్మణ్, మండల వ్యవసాయ అధికారి ప్రకాష్, ఉద్యానవన అధికారి జ్యోతితో పాటు రైతులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర ప్రణాళిక పంటలను తయారు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త వినోద్‌కుమార్, భాస్కర్‌రావు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జనగామ, మేడిపల్లి, అల్లూరు గ్రామాలలో వ్యవసాయం ఉద్యాన పంటల సాగుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ యేటా వరి, పత్తి సాగు చేయడం వలన వాతావరణంలోని మార్పులు చీడ పురుగులు ఎక్కువగా సోకడం వల్లన పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారన్నారు. కూరగాయలు, పూలతోటలు వేస్తే మార్కెట్‌లో ఎక్కువగా ఆదాయం వస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, మొక్కల మధ్య అంతర్‌పంటలు సాగు చేయడం వల్ల ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. రసా యన ఎరువులను తగ్గించాలని సూచించారు. వ్యవసా యంతోపాటు కోళ్లు, మేకలు, గొర్రెను పెంచుకొని అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో నవ్య, కన్నకి, లక్ష్మణ్, జ్యోతి రైతులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



బాడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కమాన్‌పూర్, జూన్10(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కమాన్‌పూర్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేగోళపు సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

లిటిల్ పెబ్బేల్ పాఠశాలకు అనుమతి లేదు

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కల్వచర్లలోని లిటిల్ పెబ్బేల్ పాఠశాలకు అనుమతి లేదని ఎంఈవో కొమురయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు సదరు పాఠశాలలో చేర్పించవద్దని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ముద్రితమైన పుస్తకాలను మాత్రమే వాడాలని స్పష్టం చేశారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా శ్రీనుబాబు



మంథని, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబును నియమిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి శ్రీధర్‌బాబుకు కుడి భుజంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శ్రీనుబాబు కృషి చేస్తున్నారు. మంథని నియోజకవర్గంలో పార్టీ క్యాడర్, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. టీపీసీసీ జాబితాలో శ్రీనుబాబు చోటు దక్కడంతో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ ఆధ్వర్యంలో శ్రీనుబాబు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా బాణసంచా పేల్చి, సీట్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినీత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం పదేళ్ళుగా కష్టపడి పనిచేసిన వారికి ప్రతిఫలం ఉంటుందన్నారు. నాయకులు లక్కం రాజు, అనుము ప్రశాంత్, ఇనుముల ప్రదీప్, నాగరాజు, స్వామి బర్ల రాజు, నాగరాజు, కిరణ్, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరిగా దుద్దిళ్ల శ్రీనుబాబు నియామకంపై కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తోందని అందులో భాగంగానే శ్రీనుబాబుకు జనరల్ సెక్రటరీగా అవకాశం లభించిందన్నారు. సెంటినరీకాలనీలో బాణసంచ కాలుస్తూ, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): పీసీసీ ప్రధాన కార్యదర్శిగా దుద్దిళ్ళ శ్రీనుబాబు నియామకంపై పట్టణ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. తెలంగాణ చౌరస్తాలో బాణా సంచా కాల్చి స్వీట్లు పంచారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, తిరుపతి, తిరుపతిరెడ్డి, దేవనపల్లి చక్రపాణి, అనుము రాములు, పాల్గొన్నారు.

స్ఫూర్తి పురస్కారాలు అందుకున్న జిల్లావాసులు



కట్కూరి శంకర్ స్ఫూర్తి పురస్కారం అందుకున్న మేజిక్‌రాజా, కట్కూరి శంకర్

కోల్‌సిటీటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన కళాకారుడు మేజిక్‌రాజాకు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం నిర్వహించిన వసుంధర విజ్ఞాన వికాస మండలి వార్షికోత్సవంలో మేజిక్‌రాజాను స్ఫూర్తి పురస్కారంతో సత్కరించారు. ఈ వేడుకలో చేసిన మిమిక్రీ స్టాండప్ కామెడీతో అలరించారు. పురస్కారం అందుకోవడంపై స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, కళాకారుల సంక్షేమ సంఘం, గోదావరి సరిగమలు, నియర్‌అండ్‌డియర్ స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశాయి.



అవార్డు తీసుకుంటున్న రామకృష్ణ రెడ్డి

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీటీసీ కన్వీనర్‌గా పనిచేసే కట్కూరి శంకర్‌కు స్ఫూర్తి పురస్కార్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం జరిగిన విజ్ఞాన వికాస మండలి వార్షికోత్సవంలో శంకర్‌ను సత్కరించారు. 23సార్లు రక్తదానం చేసినందుకు ఈ అవార్డును అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డి, కోట్ల వెంకటేశ్వరరెడ్డి అందజేశారు. శంకర్‌కు అవార్డు రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): జూలపల్లి గ్రామం ఆదర్శనగర్‌కు చెందిన సాన రామకృష్ణారెడ్డి హైదరాబాద్ రవింద్రభారతిలో పుడమిపుత్ర అవార్డు అందుకున్నారు. రైతు, జంతు ప్రేమికుడుగా సానరామకృష్ణారెడ్డి వసుంధర విజ్ఞాన వికాస మండలి ద్వారా పుడమిపుత్ర అవార్డు ఎంపికయ్యారు. ఈ అవార్డును వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. సభ్యులు దేవిలక్ష్మీనరసయ్య, కట్కూరి శంకర్, కె. చంద్రశేఖర్‌రెడ్డి, నల్లవెల్లి శంకర్, జబ్బార్‌ఖాన్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



సుల్తానాబాద్ లో బీజేపీ నాయకుల సమావేశం

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా నాయకుడు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ శాఖ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదురుకోవడానికి కార్యకర్తలు, నాయకులు నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ పదకొండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. యువత బీజేపీపై ఆసక్తి చూపుతున్నారన్నారు. పట్టణ శాఖ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ఎన్నికలను ఎదురుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు సౌదరి మహేందర్ యాదవ్, కందునూరి తిరుపతి, శ్రీగిరి సుధాకర్, కోట నాగేశ్వర్, కొల్లురి సంతోష్, ఇగురం రామస్వామి, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

ఓదెల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శమని బీజేపీ జిల్లా నాయకులు క్రాంతి అన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మల్లన్న క్షేత్రంతో పాటు పోచమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం బీజేపీ పాలనలో అమలు చేసిన పథకాలు వివరించారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి పృథ్వీరాజ్, దాత రాకేష్, తీర్థాల కుమారస్వామి, అనిల్‌రావు, ఆది సతీష్, తూడి రాజేందర్, చర్లపల్లి రాజు, రామినేని రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రి ఏర్పాటుచేయాలి

కమాన్‌పూర్, జూన్10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివరహాస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన బీజేపీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 30 పడకల ఆసుపత్రితోపాటు ఆసుప్రతి ముందు షాపింగ్ కాంప్లెక్స్, తహసీల్దార్ భవనం, మండల కేంద్రం నుంచి పెంచికల్‌పేట వరకు రోడ్డు ఏర్పాటుకు నిధులు విడుదల చేయాలన్నారు. నాయకులు కొయ్యడ సతీష్, మచ్చగిరి రాము, మట్టశంకర్, జంగపెల్లి అజయ్, మల్లారపు అరున్‌కుమార్, బర్లసది, మోర ప్రశాంత్, లక్ష్మణస్వామి తదితరులున్నారు.

సీబీఎస్ఈ మెగా క్యాంపస్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 గోదావరిఖనిలో సీబీఎస్ఈ మెగా క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఆర్జీ-1 టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, నాయకులు కోరారు. మంగళవారం జీఎం కార్యాలయంలో జీఎం కార్పొరేట్ ఎడ్యుకేషన్ గుండా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్జీ-1లో ఉద్యోగులు అధికంగా ఉన్నారని, ఒక్క గోదావరిఖని ప్రాంతంలోనే 12వేల మంది ఉద్యోగులు నివసిస్తున్నారని అన్నారు. యువ ఉద్యోగులు ఇక్కడి నుంచి శ్రీరాంపూర్, ఆర్జీ-2, ఆర్జీ-3 ఏరియాలకు వెళ్తూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు లక్షల రూపాయల ఫీజుల రూపంలో చెల్లిస్తుండడంతో ఆర్థికంగా వారిపై భారం పడుతోందన్నారు. ఆర్జీ-2లో ఏర్పాటు చేసిన సీబీఎస్ఈ పాఠశాలలో కూడా 406 సీట్లకు 1600 దరఖాస్తులు రావడం చూస్తే ఉద్యోగుల పిల్లలకు సీట్లు దొరకే పరిస్థితి లేదని, ప్రస్తుతం కేటాయించే సీట్లలో 90శాతం ఉద్యోగుల పిల్లలకు ఇవ్వాలని కోరారు. గోదావరిఖనిలో మెగా క్యాంపస్ ఏర్పాటు చేసి ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సతీష్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

అవయవదానంపై అవగాహన



నేత్రదానం డోనర్‌తో సదాశయ ఫౌండేషన్ కార్యకర్తలు

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా సింగరేణి సంస్థఆర్జీ-3 డివిజన్ పరిధిలోని మైన్స్‌ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో మంగళవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ మేనేజర్‌తోపాటు 30 మంది శిక్షణ పొందిన యువ ఉద్యోగులు ముందుకొచ్చారు. ఫౌండేషన్ వ్యవ స్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, గౌరవఅధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఫౌండేషన్ జాతీయ సలహాదారు నూక రమేశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి వాసు, మాజీ జెడ్‌పీటీసీ వెంకటరమణరెడ్డి, కార్యవర్గం రాములు, రాజమహేందర్ పాల్గొన్నారు.

ఎస్సీ రోస్టర్ రికార్డుల పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్‌సీ ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో ఎస్సీ రోస్టర్ విధానాల రికార్డులను షెడ్యూల్డ్ కులాల చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, కమిటీ సభ్యులు రాజేశ్వర్, వెంకటేశ్వరరావు, నాగేశ్వర్‌రావు, తిరుపతి, మహేష్ మంగళవారం పరిశీలించారు. ఏరియాల్లోని ఎస్‌సీడబ్ల్యూఏ పోస్టుల ఖాళీలు, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్‌కు అనుగుణంగా రోస్టర్ విధానంలో చేపట్టిన నియామకాలు, పదోన్నతుల వివరాలను పర్సనల్ అధికారి సుదర్శనం అందజేశారు. పరిశీలించిన చీఫ్ లైజన్ అధికారి దుర్గం రాంచందర్, సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఏ జీఎం నాగేశ్వర్ రావు, అధికారులు రామ్మోహన్, సత్యనారయణ, చంద్రశేఖర్, రాజేంద్రకుమార్, ఉద్యోగ సంఘాల నాయకులు శంకర్, బాలాంకుస్, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రొఫెసర్ హరికృష్ణ పూజలు



ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న ప్రసన్న హరికృష్ణ

ఓదెల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఓయూ రిజేండ్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పూజలు నిర్వహించారు. అర్చకు లు ప్రసన్న హరికృష్ణను సన్మానించారు. పడాల అజయ్ గౌడ్, అంజయ్య గౌడ్, మాటూరి భరత్, పల్లె రాకేష్, వీరవేని కిరణ్, విష్ణు, పల్లె శ్రీనివాస్, పాల్గొన్నారు.

భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం

కమాన్‌పూర్, జూన్10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం-2025 రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని పీఏ సీఎస్ ఛైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, తహసీల్దార్ వాసంతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతులు ఎలాంటి సమస్యలున్నా నేరుగా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. పైరవీకారుల చుట్టు తిరిగి సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. పలువురు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుగొండలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉంటే గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు అందించాలన్నారు. పంచా యతీ కార్యదర్శి రవితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో సినీనటుడు సోహెల్ సందడి

జ్యోతినగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, బిగ్‌బాస్ ఫ్రేం సోహెల్ మంగళ వారం ఎన్టీపీసీలో సందడి చేశారు. ఎన్టీపీసీ మెయిన్ రోడ్డులోని ట్రూ ఫిట్ జిమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సోహైల్‌ను బీజేపీ రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, జిమ్ నిర్వాహకులు సన్మానించారు. ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని, యువత వ్యాయామాన్ని అలవాటుగా చేసుకోవాలని సోహైల్ అన్నారు. ఆధునిక హంగులతో జిమ్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. తనను చూడడానికి వచ్చిన అభిమానులు, జిమ్ సభ్యులతో సోహైల్ ముచ్చటించారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, బీజేపీ నాయకురాలు సంధ్యారాణి, ఎన్‌సీపీ జిల్లా నాయకుడు మేకల శ్రీధర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు దాసరి రాయలింగు, జిమ్ నిర్వాహకులు ముజమ్మిల్ పాల్గొన్నారు.